## పర్యాటక వాణిజ్యంలో నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - కలెక్టరేట్

వివిధ రంగాల్లో ఉన్న వ్యాపార సంస్థలు పర్యాటక వాణిజ్యంలో నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు సోమ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఉన్న హెూటళ్లు, రిసార్ట్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హెూమ్ స్టేలు, ఫార్మ్ స్టేలు , టూర్ ఆపరేటర్స్ , ట్రావెల్ ఏజెంట్స్, టూర్ బోట్ ఆపరేటర్స్, అడ్వెంచర్ గేమ్స్ ఆపరేటర్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్స్, ఎంఐసిఇ కేంద్రాలు, వెల్ నెస్ కేంద్రాలు, సర్వీస్ అపార్ట్‌మెంట్లకు టూరిజం ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ నమోదు ప్రక్రియ ఆన్లైన్‌లో www.aptourism.gov.in వెబ్ సైట్ ద్వారా చేయాలని చెప్పారు. నమోదుకు సంబంధించిన దరఖాస్తులు, ఫీజు వివరాలు వెబ్ సైట్‌లో లభ్యంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు నమోదు, ఇతర సందేహాలకు 89191 68306 నంబరకు ఫోన్ లో సంప్రదించ వచ్చని సూచించారు.

# పూలే గొప్ప సామాజిక సంస్కర్త

ప్రజాశక్తి - కలెక్టరేట్

మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. వితంతు పునర్వివాహాల గురించి పూలే ప్రజల్లో చైతన్యం కల్పించి, స్వయంగా వితంతువులకు వివాహాలు జరిపించారని తెలిపారు. జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే బాలహత్య ప్రతిబంధక్ గృహాన్ని స్థాపించి, వితంతువులు, గర్భిణులకు అండగా నిలిచారని, దేశంలోనే ఇటువంటి కేంద్రం స్థాపించడం మొదటిసారని చెప్పారు. పులే సత్య శోధక సమాజాన్ని స్థాపించారని, దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమమని తెలిపారు. స్త్రీ, పురుషుల మధ్య లింగవివక్షను విమర్శించేవారని, సమానత్వం, స్వేచ్ఛ, ఐకమత్యంతో కూడిన సమసమాజాన్ని కాంక్షించేవారని తెలిపారు. సమాజంలో అగ్రకులాలవారి బానిసలుగా బతుకుతున్న కింది కులాల వారిలో తమ బానిసత్వం పట్ల పూలే చైతన్యం రగిలించారని, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**సాలూరు :** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తన నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వెనుకబడిన తరగతుల సంక్షేమానికి ప్రాధాన్యత ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు గిరిరఘు రాపాక మాధవరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు పాల్గొన్నారు.

**పార్వతీపురం టౌన్ :** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వైసిపి కేంద్ర కార్యాలయం వద్ద స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పూలే చిత్ర పటానికి పూలమాలలు

### పలుచోట్ల ఘనంగా నివాళి

వేసి ఘనంగా నివాళులర్పించారు. పేద, అణగారిన వర్గాలకు, మహిళలకు సమాన హక్కుల కోసం పోరాడే వ్యక్తిగా పేరుగాంచారని, ఆయన చేసిన కృషికి గాను నేటికీ ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన చేసిన కృషితో శాశ్వతంగా గుర్తుండి పోయారని అన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ ఇండుపూర్ గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మూడు మండలాల వైసిపి అధ్యక్షులు బొమ్మ రమేష్, బొంగు చిట్టి రాజు, ఎంపిపిలు మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, వార్డు కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి డైరెక్టర్లు, వైసిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

**కురుపాం :** మహత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల దినజన బాంధవుడు, నవ సమాజ నిర్మాణ కృషీవలుడు జ్యోతిరావు పూలేనని, ఆయన దేశానికి చేసిన సేవ చాలా గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కిమిడి భూషణరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగుముద్రి కాలేజీలో పూలేకు నివాళ్లు అర్పిస్తున్న రమాదేవి

పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న రాజన్నదొర

**బలిజిపేట :** జ్యోతిరావు పూలే సమాజానికి యువతకు ఆదర్శమని, ఆయన తన జీవితంలో అభ్యుదయ భావాలు కలిగి సమాజా శ్రేయస్సు కోసం ఉద్యమ బాట పట్టిన ఏకైక వీరుడని దాసరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ రంగు ముద్రి రమాదేవి కొనియాడారు. మండలంలోని చిలకలపల్లిలో రంగుముద్రి విద్యాసంస్థ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 132వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని పెదపెంకిలో బాపూజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగు ముద్రి విద్యాసంస్థల అధినేత గణపతి రావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**పార్వతీపురంరూరల్ :** స్థానిక టిడిపి కార్యాలయంలో మహాత్మా జ్యోతిభాపూలే వర్ధంతి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అద్వర్యంలో నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలుళులు అర్పించారు. అనంతరం ఆయన చేపట్టిన సంస్కరణలు, వితంతువులు, బిసివర్గాలకు ఆయన చేసిన సేవలు గురించి శ్రేణులకు వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**వీరఘట్టం :** మండలంలోని సోమవారం జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్లపాడు గ్రామంలో జనసేన జానీ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# అనర్హులను తొలగించాలి

- ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అక్రమాలు
- పరిశీలనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించాలి
- కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల ఓట్లు చేర్పింపులో అధికార పార్టీ అండదండలతో వాలంటీర్లు, ప్రభుత్వ అధికారులు అనర్హులకు, డిగ్రీ లేని వారికి చదువు లేని వారిని ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేశారని, కావున వెంటనే అనర్హులను తొలగించాలని, ఓట్ల పరిశీలనకు జిల్లాస్థాయిలో ప్రత్యేక అధికారి నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు సోమవారం వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలాగే అక్టోబర్ 1 నుంచి నవంబరు 5 వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 10వేల ఓట్లు చేరగా సచివాలయాలు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు వాలంటీర్లకు బాధ్యతలు అప్పజెప్పిన తర్వాత ఒక్క 7వ తేదీనే 7వేల ఓట్లు నమోదు అయ్యాయని తెలిపారు. వీటిలో భారీ అవకతవకలు అధికార పార్టీ చేపట్టినట్లు కనిపిస్తుందన్నారు. మన జిల్లాలో 15 మండలాల్లో 24 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేశారన్నారు. ఉదాహరణకు పోలింగ్ స్టేషన్ 73లో వరుస సంఖ్య 326 సుధా శనపతి చదువులేదనీ కానీ నమోదు చేశారన్నారు. అలాగే వరుస సంఖ్య 176 జి.శంకర్రావు ఐదో తరగతి విద్యార్హత ఉంటే అతనికి ఓటు నమోదు చేశారని, బూత్ నెం. 75లో సీరియల్ నెంబర్ 2లో పదో తరగతి అర్హతతో స్పందన దేవరపల్లికి ఓటు ఇచ్చారన్నారు. ఇలా అర్హత లేని వారు చాలామంది ఉన్నారన్నారు. 78 బూతు నెంబర్లో 7,10 వరుస సంఖ్యలో డిప్లొమా వారికి కూడా ఓట్లు నమోదు చేశారని అన్నారు. అన్ని బూతుల్లో ఇవి కనిపిస్తున్నాయినీ, ఇవి కొన్ని మాత్రమే అన్ని అన్నారు. అవకతవకులు జరిగినట్లు మా పరిశీలనకు వచ్చాయినీ ఎన్నికల కమిషన్ చర్య తీసుకుని ఇలాంటి వాటిని తొలగించాలని కోరారు. డిసెంబర్ 9 వరకు అర్హులందరినీ చేర్పించాలని అన్నారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.గంగు నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

## 30న వికలాంగుల దరఖాస్తుల పరిశీలన

**కలెక్టరేట్ :** మూడు చక్రాల మోటారు సైకిళ్లకు దరఖాస్తు చేసుకున్న శారీరక వికలాంగులకు ఈనెల 30న ధ్రువపత్రాల పరిశీలన చేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు శాఖ ఎడి ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన స్థానిక కలెక్టరేట్‌లో గల సెల్లార్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని తెలిపారు. ఇతర . వివరాలకు 08942240519 ఫోన్ కు సంప్రదించాలని సూచించారు.

రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

## అన్నదాతలకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటోందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. పంటరుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన 35,020మంది రైతులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీ కింద రూ.6.11కోట్లు, పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ కింద 887 మంది రైతులకు రూ.39లక్షలకు చెందిన చెక్కును సోమవారం ఆయన తన కార్యాలయంలో రైతులకు అందజేశారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి సోమవారం తన కార్యాలయం నుండి వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీ, ఇన్ పుట్ సబ్సిడీ మొత్తాలను బటన్ నొక్కి నేరుగా రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి వర్చువల్‌గా కలెక్టరు నిశాంత్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ జెడి రాబర్ట్ పాల్, మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు హాజరైనారు.

## గిరిజన పంచాయతీలకు నీరు, విద్యుత్ ఇవ్వాలి

**కలెక్టరేట్ :** జల జీవన్ మిషన్ ద్వారా గిరిజన పంచాయితీలకు తాగునీరివ్వాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన పిఒ ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ప్రభాకర్‌ను పిలిపించి జెజెఎంకు సంబంధించిన పనులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి నివేదిక ఇవ్వాలని తెలిపారు. అలాగే త్రీఫేజ్ విద్యుత్ విషయంలోనూ చర్యలు తీసుకుంటామని పిఒ హామీ ఇచ్చారు.

# తక్షణమే ధాన్యం కొనాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కొనుగోలు చేయాలని ఎంపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం దాసు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు గత నెల రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రచారం చేయడం తప్ప గ్రామాల్లో, సచివాలయాల్లో ఎటువంటి చర్యల్లేవన్నారు. జిల్లాలో ధాన్యం నూర్పులు పూర్తయ్యాయని, వీటిని ఎక్కడ దాచుకోవాలి రైతులకు అర్థం కావడం లేదని అన్నారు. తుఫాన్లు వస్తే రైతులు బిక్కు బిక్కు మంటూ ధ్యాన్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం, అధికారులు హడావిడి చేస్తున్నారు తప్ప రైతు భరోసా కేంద్రాల్లో బస్తాల్లేవని, తయారైన ధాన్యం ఎక్కడకు తీసుకు వెళ్లాలో నిర్దిష్టమైన ఆదేశాల్లేవని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని, బస్తాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె సీతారాం పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గిరిజన రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేయాలని, నష్టపోయిన జీడిపంటకు పరిహారం చెల్లించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్ డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేటి వరకు ఎక్కడా కొనుగోలు ప్రక్రియ ప్రారంభించలేదని అన్నారు. వరి కోతలు ప్రారంభించి 20 రోజులైనా ధాన్యం కల్లాల్లోనే కనిపిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది కూడా ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించిన 30 శాతం మాత్రమే కొనుగోలు చేశారని అన్నారు. దీంతో రైతులు గత్యంతరం లేక మిగిలిన ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకోవాల్సి వచ్చింది అన్నారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆయన కోరారు. మరోవైపు గిరిజనుల ప్రధాన జీవనాధారమైన జీడి పంటను ఐటిడిఎ, జిసిసి ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోలు చేయాలన్నారు. వేలాది ఎకరాల్లో జీడి పంట పండిస్తున్న వ్యాపారులకు గత ఏడాది కారు మబ్బుల కారణంగా జీడి పంట పూర్తిగా నష్టం వాటిల్లిందని అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఏజెన్సీలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేసి గిరిజనులకు ఉపాధి కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎం సన్యాసిరావు, పాండురంగ ఉన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

### ధాన్యం కొనుగోలులో సమస్యలు రాకుండా చూడాలి : జెసి

**కలెక్టరేట్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరలకు ధాన్యం సేకరణ జరుగుతుందని రైతులకు భరోసా కల్పించాలని సంయుక్త కలెక్టరు ఒ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే, స్పందన, నాడు-నేడు, సిమెంటు సరఫరా, పాఠశాలలో రిపేర్లు, ధాన్యం సేకరణ మొదలైన అభివద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా, మండల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. రీ సర్వే అనంతరం తప్పులు లేకుండా రికార్డులు తయారు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. మ్యుటేషన్లు, సవరణలు తదితర ధరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. నాడు-నేడు పనులు స్థితిని తెలియజేయాలన్నారు. సిమెంటు సరఫరా గురించి సమీక్షించారు. ధాన్యం సేకరణకు సంబంధించి తహశీల్దారు, ఎంపిడిఒలు, వ్యవసాయ అధికారులు మండలంలో భాద్యత తీసుకోవాలన్నారు. అధికారులు వారికి కేటాయించిన ప్రతి రైతుభరోసాకేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లు తనిఖీ చేయాలన్నారు. ప్రతి మిల్లరు బ్యాంకు గ్యారంటీ అందజేసేలా సత్వరం చర్యలు తీసుకోవాలని తెలిపారు. షెడ్యూలు ప్రకారం ధాన్యం సేకరణ జరగాలని, రైతు సమాచారం ఇచ్చిన వెంటనే పొలం వద్దకు వెళ్లి ధాన్యం నాణ్యత, తేమ తనిఖీచేసి రైతుకు తెలియజేయాలన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు వస్తే కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోలు రూంకు తెలియజేయాలన్నారు. సమీక్షా సమావేశంలో ఐటిడిఎ పిఒ పి.విష్ణుచరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బిక్షాటన చేస్తున్న సవరభాష విద్యావాలంటీర్లు

## విధుల్లోకి తీసుకోవాలని బిక్షాటన

ప్రజాశక్తి- సీతంపేట

తమను విధుల్లోకి తీసుకోవాలని, బకాయివేతనాలు చెల్లించాలని కోరుతూ నాలుగు మండలాలకు చెందిన సవర భాష విద్యా వాలంటీర్లు ఐటిడిఎ ముఖద్వారం అడివి తల్లి విగ్రహం వద్ద సోమవారం బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సవరభాష విద్యా వాలంటరీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. డొంబు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు నాలుగు నెలల గౌరవ వేతనం చెల్లించ లేదన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కోటరామచంద్రపుర ఐటిడిఎ పరిధిలోని సవరభాష విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేసి గౌరవ వేతనం వారి అకౌంట్‌లో జమ చేశారని గుర్తు చేశారు. అలాగే తమను కూడా రెన్యువల్ చేసి, పాత జీతాలు తమకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గౌరవ వేతనం అందక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు 20 ఏళ్లుగా వాలంటీర్లుగా చేస్తున్నామని, అయినా తమకు ఉద్యోగ భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ బి నవ్యకు వినతి పత్రం సమర్పించారు. దీనికి ఆమె స్పందిస్తూ జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆనందరావు, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేసులు తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కేసుల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో సాలూరు సర్కిల్ పోలీసు అధికారులతో పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక కార్యాచరణతో కేసుల దర్యాప్తును పూర్తి చేయాలని, దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు దర్యాప్తు అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి, ఆయా కేసుల్లో దర్యాప్తును ఒక్క మాసంలోగా పూర్తి చేయాలని, సంబంధిత కోర్టుల్లో అభియోగ పత్రాలను దాఖలు చేయాలని అన్నారు. అభియోగ పత్రాలు దాఖలు చేసిన కేసుల్లో న్యాయ స్థానాల నుంచి సిసి నెంబర్లు పొందాలన్నారు. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో సాధించిన ప్రగతిని సిసిటిఎన్ఎస్ వెబ్ పోర్టల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ఎఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బి సిఐ శ్రీనివాసరావు, డీసీ ఆర్బీ సిఐ ప్రభాకరరావు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**స్పందనతో బాధితులకు సత్వర న్యాయం**

స్పందన కార్యక్రమం ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా 16 దరఖాస్తులను స్వీకరించారు. బాధితులను ప్రతి ఒక్కరితో ప్రత్యేకంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు వెంటనే తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఓ.దిలీప్‌కిరణ్, ఎస్‌బి సిఐ శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్.వి. ప్రభాకరావు, ఎస్ఐ దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

## టిడ్కో ఇళ్ల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని అడ్డాపుశిలలో నిర్మాణంలో ఉన్న టెట్కో గృహ సముదాయాలను రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న 768 వైఎస్ఆర్ జగన్న నగర్ జి-3 ఇళ్ల సముదాయాలను భవిష్యత్‌లో పెద్దఎత్తున చేపట్టనున్నామన్నారు. రానున్న పరిస్థితులకు అనుగుణంగా ఇళ్ల సముదాలయాలకు సదుపాయాలు కల్పించాలన్నారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా కార్యాచరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్‌లో 768 గృహాలను నిర్మిస్తూ రిజిస్ట్రేషన్ ఉచితంగా చేసి సుమారుగా రూ.10 లక్షల ఆస్తిని లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిట్కో ఇంజనీర్లు, మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**గుమ్మలక్ష్మీపురం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్ తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన జరిగే సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### కమిషనర్‌గా సర్వేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి పాలకొండ

నగర పంచాయతీ కమిషనర్‌గా సర్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూజివీడు మున్సిపాల్టీలో రెవెన్యూ అధికారిగా పనిచేసి బదిలీ పై ఇక్కడకు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ రామారావు సుమారు రెండునెలల క్రితం లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడడంతో సస్పెండైన సంగతి తెలిసిందే. తొలుత ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్‌ను ఇక్కడ అదనపు బాధ్యతలు ఇస్తూ నియమించగా నెలరోజుల క్రితం ఆ ఉత్తర్వులు మార్చి విజయనగరం అసిస్టెంట్ కమిషనర్ బిడివి ప్రసాద్‌కు అదనపు బాధ్యతల్లో నియమించారు.

# వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీలోని అన్ని వార్డుల్లో సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అజెండాలో ప్రవేశపెట్టిన అంచాలను సభ్యులకు చదివి వినిపించిన అనంతరం ఎజెండాలో పొందుపర్చిన అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రధానంగా 30 వార్డుల్లోనూ సిసి కాలువలు, రోడ్లు నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని, రానున్న కాలంలో శతశాతం అభివృద్ధి పనులు పూర్తిచేసి మున్సిపాల్టీ సమగ్ర అభివద్ధికి కషి చేస్తామని ఎమ్మెల్యే సభ్యులకు తెలిపారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మున్సిపాల్టీలో చేపట్టిన గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం జీరో అవర్‌లో 8వ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు మాట్లాడుతూ పట్టణంలో సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, పంటలను పందులు నాశనం చేస్తున్నాయని, వాటిని నిర్మూలించాలని, పట్టణ ప్రధాన రహదారిలో పలు కూడళ్లలో రోడ్లకు గుంతల పడి దుమ్ము, ధూళితో పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని, షాపింగ్ కాంప్లెక్స్ లో షాపులను దక్కించుకొనిన యజమానులు బినామీలకి ఎక్కువ అద్దెలకు ఇస్తూ మున్సిపల్ ఆదానికి గండి కొడుతున్నారని అట్టి వారిపై చర్యలు చేపట్టాలని, రిలయన్స్ స్మార్ట్ బజార్ భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన సమాచారం టౌన్ ప్లానింగ్ అధికారులు తెలియపరచాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూర్ గుణేశ్వరరావు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కమిషనర్ జె.రామ రామప్పల నాయుడు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### మున్సిపల్ సమావేశంలో ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామఅప్పలనాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com



## పారిశుధ్య పనులు పరిశీలన

**సీతానగరం :** మండలంలోని మేజర్ పంచాయతీ పెద బోగిలి లో పారిశుధ్యం పనులను ఎంపిడిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డి సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఎస్సీ వీధులో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇటీవల రెల్లి వీధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, పనులు చేపట్టాలని స్థానికులు విన్నవించడంతో ఆ వీధిలో పనులను కూడా చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జె.తేరేజమ్మ, గరికయ్య, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఇఒపిఆర్‌డి జి.వెంకట్రావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## ఎల్విన్‌పేటలో వాహన తనిఖీలు

**గుమ్మలక్ష్మీపురం :** ప్రతి ఒక్క వాహనదారుడు అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఎల్విన్‌పేట మూడు రోడ్ల కూడలి వద్ద సోమవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి ఆంధ్రాకు వచ్చే ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనదారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమతి పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ముఖ్యంగా మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖ రావు ఉన్నారు.

## విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్య పెంపునకే 'లిప్'

**జియ్యమ్మవలస :** పిల్లల్లో అభ్యాసన స్థాయిలు పెంపొందించేందుకు లిప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంఇఒ వై.విలమకుమారి అన్నారు. మండలంలోని బిజెపురం హైస్కూల్లో సోమవారం లిప్ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా గుర్తించి పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించడానికి తమ వంతు కృషి చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజె పురం ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం బడే గౌరినాయుడు రిసోర్స్‌పర్సన్ లలిత కుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రామభద్రపురంలో 'మన ఊరు -మన పోలీస్'

**జియ్యమ్మవలస :** మండలంలోని రామభద్రపురంలో పోలీసు అవగాహనా కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై పి.అనీష్ మాట్లాడుతూ యువతీ యువకులు సత్ప్రవర్తన కలిగి చదువు పట్ల శ్రద్ధ వహిస్తూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా మహిళల పట్ల యువకులు గౌరవంగా ఉండి ఎటువంటి కేసుల్లో ఇరుక్కోకుండా మెలగాలని కోరారు. మద్యపానం, నాటుసారాకు బానిసలు కాకుండా ప్రజలు ఉండాలని, వాటికి దూరమైనప్పుడే కుటుంబం గౌరవం కాపాడుకోగలమని సూచించారు. మద్యపానానికి బానిసై ఇటీవల కొండ గౌరిమహేష్ మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొందని, ప్రతి ఒక్కరూ దీన్ని గమనించి మంచి అలవాట్లుతో అనారోగ్యానికి గురి కాకుండా కుటుంబాలతో ఆనందంగా కలిసి జీవించాలని సూచించారు.

## అంగన్వాడీ కేంద్రం సందర్శన

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రినాధులు

**పాలకొండ రూరల్ :** మండలం లో చినమంగళా పురం అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంపిడిఒ డొంక త్రినాధులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు, ఎటువంటి పోషక విలువల ఆహారాన్ని అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో పింఛను సర్వే ప్రకియను పరిశీలించారు. పారదర్శకంగా సర్వే చేపట్టాలన్నారు.

## ఐక్య ఉద్యమాలకు స్ఫూర్తి లక్ష్మునాయుడు

**పాలకొండ :** ఉపాధ్యాయ వర్గానికి వెన్నుదన్నుగా నిలిచిన వ్యక్తి లక్ష్మునాయుడని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి అన్నారు. ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సీమల లక్ష్మునాయుడు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య ఉద్యమాలు చేయడంలో లక్ష్మునాయుడు ఎనలేని స్ఫూర్తి కల్పించేవారన్నారు. తెలుగుభాషా గొప్పతనాన్ని వివరించేవారిని, నేటి తరానికి ఆయన ఒక మార్గదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్, వార్డు కౌన్సిలర్ గంగునాయుడు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ఎస్.వాసుదేవరావు, నాయకులు ప్రభాకరరావు, రమణమూర్తి, గోగుల సూర్యనారాయణ, మదన్‌మోహన్, టంకాల ఉమామహేశ్వరరావు తదితరులున్నారు.

మాట్లాడుతున్న జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ అంజనేయులు

## న్యాయ వ్యవస్థపై అవగాహన తప్పనిసరి

**ప్రజాశక్తి - కురుపాం**
ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన కలిగి న్యాయ వ్యవస్థ పై అవగాహన ఉండాలని స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు అన్నారు. మండలంలోని సెయింట్ మౌంట్ పోర్ట్ విద్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడకూడదని, అందరూ సోదరభావంతో కలిసి మెలిసి చదువుకోవాలని చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం రాజ్యాంగ హక్కులు, విధులపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఎస్.హర్షిని ప్రథమ, జి.అపూర్వ ద్వితీయ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి.కుమార్ స్వామి, కె.అశోక్, మండల లీగల్ సర్వీస్ సెల్ కమిటీ సభ్యులు అండవరపు కోటేశ్వరరావు, గౌరాని వెంకట్రావు, బాలినేని గోవిందరావు, ఎన్. స్కూల్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరితగతిన డోర్ టు డోర్ ఓటరు సర్వే

**కురుపాం :** త్వరితగతిన డోర్ టు డోర్ ఓటర్ల సర్వే, 6 బి, ఓటర్లు సంబంధించి రిజిస్టర్ ఏర్పాటు చేసి 2023కి సంబంధించిన కూడా అర్హుల జాబితాను సిద్ధం చేసుకోవాలని సచివాలయం సిబ్బంది బిఎల్ఒలకు తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక మేజర్ పంచాయతీలో గల సచివాలయం 1, 2 సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది రిజిస్టర్లను, వారి పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందికి ఓటరు జాబితా అంతా సిద్ధంగా ఉంచుకొని సచివాలయ సిబ్బంది అన్నివేళల ప్రజలకు అందుబాటులో ఉండాలని సేవలు అందించాలని సూచించారు.

ఆందోళన చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది

## కొత్త మెనూ రద్దు చేయాలని ధర్నా

**బలిజిపేట :** ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త మెనూ రద్దు చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు యు.లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కొత్త మెనూ అమలు చేయమని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కొత్త మెనూ ప్రకారం వండితే పిల్లలు తినడం లేదని, కావున పాత మెనూనే అమలు చేయాలని కోరారు. అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.15వేలు వేతనం ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతి పిల్లలను హైస్కూల్స్‌కు తరలించి మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలు తగ్గిస్తున్నారని అన్నారు. కావున పాత పద్ధతి ప్రకారం జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని ఆమె కోరారు.

# స్పందన అర్జీలు వెంటనే పరిష్కరించాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్**
స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ పి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 120 దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులు కొన్ని....
గుమ్మలక్ష్మీపురం మండలం ఒడ్రుబంగికి ఎగువ తాడికొండ నుంచి సిహెచ్ భద్ర మీదుగా బిటి రోడ్డు మంజూరు చేయాలని ఎం.రమేష్, గ్రామస్తుల దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం మండలం వెంకంపేటకు సురేష్ తమ గ్రామంలో గల జెడ్‌పి ఉన్నత పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్ నిర్మించాలని కోరారు. పార్వతీపురం పట్టణంలో అగ్రిగోల్డ్ బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించి ఆత్మహత్యలు జరగకుండా కాపాడమని అగ్రిగోల్డ్ కస్టమర్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.వి.నాయుడు, మన్యం జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు వినతిని అందజేశారు. అలాగే పదో వార్డులోని ముత్తా వారి వీధికి చెందిన ఆర్.సుగుణాదేవి, డి.రవణమ్మ, కె.సీతమ్మ, ఎస్.సూర్యనారాయణకు 2020లో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు కానీ ఇంతవరకు స్థలం ఎక్కడ ఉందో చూపించడం లేదని దరఖాస్తు చేసుకున్నారు. సీతానగరం మండలం జానుమల్లివలసలో సర్వేనెంబర్ 90-29 లో శ్మశాన వాటిక చుట్టూ అక్రమాలు తొలగించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సిహెచ్.తిరుపతిరావు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలని, పులి, ఏనుగుల బారి నుంచి ప్రజలను రక్షించాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి దరఖాస్తు అందజేశారు. దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ జి జనార్ధన్ రావు, సభ్యులు కోరారు. పార్వతీపురం మండలం పెద్దబుడ్డికి చెందిన వికలాంగుడు ఎ.సురేష్ పింఛను మంజూరు చేయమని వినతిని ఇచ్చారు. కొమరాడ మండలం కందివలసకు చెందిన కె.కౌశల్ తనకు వైయస్సార్ చేయూత మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం కృష్ణపల్లికి చెందిన టి.మహేష్ కుమార్ తమ తల్లిదండ్రులు మరణ ధ్రువీకరణ పత్రంలో తప్పులు సవరించాలని కోరారు. గరుగుబిల్లి మండలం దత్తివలసకు చెందిన టి.జమునారాణి తమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్దవోలుకు చెందిన బి.దమయంతి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సీతానగరం మండలం రామావరానికి చెందిన ఆర్.లక్ష్మణ్ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని జిల్లాశాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఫిర్యాదుదారులు

వినతులు స్వీకరిస్తున్న పిఒ బి.నవ్య

## స్పందనకు 43 వినతులు

**సీతంపేట :** ఐటిడిఎ స్పందనకు 43 వినతులు వచ్చాయి. స్పందన కార్యక్రమం సోమవారం ఐటిడిఎలో పిఒ బి. నవ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవనాపురం గ్రామానికి చెందిన పి. కృష్ణారావు వెల్డింగ్ షాప్ లోను ఇప్పించాలని, బొడ్డగూడ గ్రామానికి చెందిన బి. మూర్తి కిరణ్ షాప్ లోను ఇప్పించాలని విన్నవించారు. కడగండి వలస గ్రామానికి చెందిన పి. రాములమ్మ ఏనుగుల ద్వారా నష్టం జరిగిన పంటకు పరిహారం చెల్లించాలని, తుంగతంపర కాలనీకి బి. హేమలత సోలార్ బోర్ మంజూరు చేయాలని, బొక్కుడు గూడ గ్రామానికి చెందిన బి కృష్ణకుమారి హాస్పటల్లో నర్స్ పోస్టు ఇప్పించాలని విన్నవించారు. ఈ స్పందన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేట్ ఇంజనీర్ జి మురళి, ఏటి డబ్ల్యూ మంగ వేణి, సిడిపిఒ రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముఖలింగం మృతి బాధాకరం

**సీతంపేట :** గిరిజనులు అనారోగ్యానికి గురై అర్థాంతరంగా తనువు చాలించడం బాధాకరమని టిడిపి నాయకులు భూదేవి అన్నారు. మండలంలోని తాలాడ పంచాయతీ మూర్తిగాడి గూడలో ఇటీవల అనారోగ్యంతో యస్ ముఖలింగం మృతి చెందగా సోమవారం ఆమె మృతుని భార్య నర్సమ్మ, కుమారుడు గిరి, కుమార్తె మెర్సీ లను పరామర్శించారు. ముఖలింగం 45 ఏళ్లకే మృతి చెందటం బాధాకరమని అన్నారు. గిరిజన గ్రామాల్లో తక్కువ వయస్సులోనే వివిధ వ్యాధులతో తనువులు చాలిస్తున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి మరణాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక యువ నాయకుడు సవర నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ విశ్వనాథం, కూర్మారావు, సీనియర్ నాయకుడు సవర మంగన్న, శిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని హారికకు ప్రశంసలు

**మక్కువ :** ఇటీవల జరిగిన జిల్లాస్థాయి కౌశల్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని ఆర్.హారికను సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు ప్రశంసించారు. మండలంలోని వెంకటభైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ తరగతి చదువుతున్న రౌతు హారిక పోస్టర్ ప్రజెంటేషన్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. దీనికిగానూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.పద్మావతి, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.రామకృష్ణ, మిగిలిన పాఠశాల సిబ్బంది హారిక నగదు ప్రోత్సాహాన్ని అందిస్తూ అభినందించారు. అలాగే ఈనెల 9న విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలో తప్పనిసరిగా విజేతగా నిలిచి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## 30న పార్వతీపురంలో జిల్లాస్థాయి క్రీడలు

**ప్రజాశక్తి- పాలకొండ రూరల్**
జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా ఈనెల 30న పార్వతీపురంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి వి.పుష్పనాథం సోమవారం తెలిపారు. పాలకొండ నియోజక వర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు 30న జరిగే జిల్లా స్థాయి క్రీడలకు హాజరుకావాలన్నారు. వివరాలకు జెడ్‌పిహెచ్ ఎస్ఇ చిన్న మంగళాపురం పీడీ (కోచ్) 7675082642' పి కరుణాకరరావు- (మేనేజర్), వాలీ బాల్ (మహిళలు) కోచ్ వి. మాణిక్యం 6302263208, డి. పోలిరాజు, పిఇటి వండవ (మేనేజర్) 9948308743, వాలీ బాల్ (పురుషులు) ఎ. రాజేంద్రకుమార్, పిఇటి, జెడ్‌పిహెచ్ఎస్, బిటివాడ. (కోచ్) 9398105149, కె హరిబాబు పిడి, (మేనేజర్) జెడ్‌పిహెచ్ఎస్, 8500041682, కబడ్డీ(మహిళలు) ఎస్ పద్మరాజు పీడీ, జెడ్‌పిహెచ్ ఎస్, ఎమ్ సింగుపురం (కోచ్) 6301564319, డి. సంతోష్ పిఇటి, జెడ్‌పిహెచ్ఎస్ వండవ (మేనేజర్) - 9346241522, కబడ్డీ (పురుషులు) తూముల మధు సూధన రావు, పిఇటి, జెడ్‌పిహెచ్ఎస్, కె కవిటి (కోచ్) - 9494165054, గొర్లె శివ రామప్రసాదు, పీడీ ఎపిఎమ్ఎస్ బామిని (మేనేజర్) 9502074448 లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఎన్ఇపితో తీవ్ర నష్టం : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - సాలూరు**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విద్యా విధానంతో విద్యార్థులకు తీరని నష్టమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు అన్నారు. సోమవారం పట్టణంలోని దండిగాం రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగంలో గొప్ప సంస్కరణలు తీసుకొస్తున్నామని వైసిపి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుదన్నారు. పాఠశాలలు తెరుచుకుని వందరోజులైనా నేటికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ కాలేదని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు కాస్మొటిక్స్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాదీవెన పథకం కింద పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయాలని, వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నితిన్, వరుణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు : డిప్యూటీ సిఎం

**ప్రజాశక్తి - సాలూరు**
రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. పట్టణంలోని 25వ వార్డు పిఎన్ బొడ్డవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. అంతకుముందు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు సింగారపు ఈశ్వరరావు, గిరిరఘు, రాపాక మాధవరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ పాల్గొన్నారు.

**సీతానగరం :** మండలంలోని తామరకండి సచివాలయం పరిధిలో గల బక్కుపేట సోమవారం పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బి.శ్రీరాములునాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, అంబటి కృష్ణంనాయుడు, అర్ని, రత్నాకర్, తెంటు వెంకటప్పల నాయుడు, ఎన్.రామకృష్ణ, సర్పంచ్ గొట్టాపు మంగ, నాయకులు జి.అప్పారావు, మాజీ సర్పంచి బి.సూర్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## అజ్జాడలో ఫ్యామిలీ ఫిజీషియన్

**ప్రజాశక్తి - బలిజిపేట**
మండలంలోని అజ్జాడలో సోమవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ( ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్)ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు పర్యవేక్షణ జరిగింది. వైద్యాధికారి, సిబ్బంది రోగులకు చేపట్టిన ఆరోగ్య తనిఖీలను, అవసరమైన రక్త పరీక్షలను పరిశీలించారు. స్థానికులకు ఈ కుటుంబ డాక్టర్ విధానంపై డాక్టర్ జగన్మోహన్ అవగాహన కల్పించి, ఆవశ్యకతను వివరించారు. అలాగే అనారోగ్య లక్షణాలున్న వారికి సందేహాలను నివృత్తి చేశారు. 104 వాహనంలోనే అందుబాటులో ఉన్న ఇసిజి పరికరం ద్వారా గర్భిణులకు తీసిన ఇసిజి రిపోర్ట్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో క్షేత్ర స్థాయి సందర్శనలను పర్యవేక్షించారు. కదల్లేని స్థితిలో ఉన్న వారి గృహ సందర్శన చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. వారి ఆరోగ్య స్థితి పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య స్థితి, రికార్డులను జగన్మోహన్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు జి.శశిధర్, ఎఎన్ఎం చిన్నన్నలు, ఎంఎల్‌హెచ్ పి.సునీత, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

**వీరఘట్టం :** మండలంలోని చిట్టపూడి వలస గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారిని పి. ఉమామహేశ్వరి గర్భిణీలతో పాటు వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 జిల్లా మేనేజర్ రాజశేఖరం, హెల్త్ సూపర్‌వైజర్ ఓ. శాంతి కుమారి, సర్పంచ్ కుమిలి పాపమ్మ, కే. లక్ష్మణ, ఏఎన్ఎం పైడితల్లి, ఎంఎల్ హెచ్‌పి పవిత్ర, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు 104 సిబ్బంది పాల్గొన్నారు.

## 'తొలగిస్తే సహించేది లేదు'

**గుమ్మలక్ష్మీపురం :** గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలో పదేళ్ల క్రితం క్రైస్తవులు ఏర్పాటు చేసుకున్న కారుణ్య దివ్య పుణ్యక్షేత్రాన్ని రెవెన్యూ అధికారులు తొలగించాలని చూస్తే సహించేది లేదని వివిధ మండలాలకు చెందిన క్రైస్తవ భక్తులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలో గల క్రైస్తవ పుణ్యక్షేత్ర స్థలంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి వి రమణ, సుంకి పంచాయతీ సర్పంచ్ కరణం రవీంద్ర, ఫాదర్ సున్నా ప్రసాదరావు, రావుపల్లి ఎంపిటిసి సదానందం, బొండపల్లి ప్రసాద్, నేతల ప్రకాష్, క్రైస్తవ ప్రబోధకులు అర్లప్ప, మాట్లాడుతూ అధికారుల వ్యవహరించిన తీరు క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీసేదిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు పునరాలోచించుకొని ప్రతిపాదిత పుణ్యక్షేత్రాన్ని మినహాయించి మిగిలిన స్థలాన్ని మాత్రమే ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అధికారులు తొలగించిన విగ్రహాలను వెంటనే పునః ప్రతిష్ట చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గరుగుబిల్లి, పార్వతీపురం, వీరఘట్టం మండలాల నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవ భక్తులు హాజరయ్యారు.

## లింగ వివక్ష చూపొద్దు

**భామిని :** స్థానిక వెలుగు భవనంలో ఎపిఎం దొడ్ల భవాని ఆధ్వర్యంలో లింగ వివక్ష పై సోమవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పని ప్రదేశాలలో, వృత్తిలో, విద్యలో, ఇంట్లో, సమాజం లో పురుషులు, స్త్రీలు మధ్య ఎవరు వివక్ష చూపరాదని అన్నారు. ఈ అంశంను ఎస్‌హెచ్‌జి సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగించాలని, లింగ వివక్షను రూపుమాపటానికి కృషి చేయాలని తెలిపారు

## బాల్య వివాహాలపై అవగాహన

**మక్కువ:** మండలంలోని మక్కువ సెక్టార్లో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ పి.రాజశ్రీ, అంగన్వాడీ వర్కర్లు కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం బాల్యవివాహాలు చేయడం వల్ల అమ్మాయిలకు కలిగే శారీరక, మానసిక సమస్యలను తల్లిదండ్రులకు వివరించారు. 21ఏళ్లు నిండని బాలికలకు వివాహం చేయడం చట్టవ్యతిరేకమైన చర్య అని, అలా వివాహం చేసిన తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే తల్లిదండ్రులు, బాలికలను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలని, లింగ వివక్ష చూపించరాదని సూచించారు. కార్యక్రమంలో మక్కువలోని అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

**సాలూరు :** పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టాలపై అవగాహన అవసరమని ఐసిడిఎస్ అర్బన్ సిడిపిఒ బి.సత్యవతి కోరారు. పట్టణంలోని మూడో సెక్టార్ శ్యామలాంబ గుడి వద్ద పోక్సో ఇతర చట్టాలపై అవగాహన కల్పిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సత్యవతి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో ఎలాంటి లైంగిక వేధింపులు ఎదుర్కొన్నా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జి.నాగేశ్వరరావు, సెక్టార్ నాయకులు శ్యామల పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక భరోసా

**కురుపాం :** వైఎస్సార్ చేయూత మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో భరోసా కలుగుతుందని పెద్ద గొత్తిలి సర్పంచ్ టి.లోకనాథం అన్నారు. సోమవారం పెదగొత్తిలి పశువైద్య కార్యాలయం వద్ద పశువైద్యశాఖ, ఐకెపి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహిళలనుద్దేశించి మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత ద్వారా రూ.18750 ప్రభుత్వం ఇస్తుందని, వీటితె మహిళలు ఆవులను కొనుగోలు చేసుకుని పాల ఉత్పత్తి ద్వారా ఆర్థికంగా ఎదగాలని, ఎట్టి పరిస్థితుల్లో చేయూత డబ్బుల్ని వృథా చేయకూడదని మహిళలకు సూచించారు.
అనంతరం లింగ వివక్షత గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు వి.కృష్ణకుమారి ఐకెపి సిసి రాజారావు, పశు వైద్య శాఖ సిబ్బంది శ్రీనివాసరావు, విఒఎ సంజీవరావు, మహిళలు పాల్గొన్నారు.

## ధరలను అదుపుచేయని ప్రభుత్వం

**గుమ్మలక్ష్మీపురం :** ఏజెన్సీలో టిడిపి పూర్వ వైభవానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి కోరారు. మండలంలోని మారుమూల కొండ శిఖర గ్రామమైన వంగరలో ఆమె సోమవారం పర్యటించారు. రాష్ట్రంలో వైసిపి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజల కష్టాలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక సుధ, కొండలరావు, రామకృష్ణ, ప్రసాదరావు, ధర్మారావు, మంజుల ఉన్నారు.

మాట్లాడుతున్న బిడ్డిక పద్మావతి

## ఎమ్మెల్యే సోదరుడిపై ఫిర్యాదు

**పార్వతీపురంరూరల్ :** రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే సోదరుడు వైసిపి నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌పై స్థానిక పోలీసులకు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపికి అలవాటైన ఫ్యాక్షన్ రాజకీయాన్ని ప్రదర్శిస్తూ తమ పార్టీ జాతీయ అధ్యక్ష, కార్యాదర్శులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకుని వారిపై చర్యలు చేపట్టాలని, చంద్రబాబు, నారా లోకేష్‌కు ఎటువంటి ప్రమాదం జరిగినా అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్**
జిల్లాలో ధాన్యం కొనుగోళు వెంటనే ప్రారంభించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వరికోతలు ప్రారంభమై నెలరోజులు కావస్తుందని, ఇప్పుడు ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయని, అయినా ఇంతవరకూ ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. దీని వల్ల పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేక రైతులు నానాయాతనులు పడుతున్నారని అన్నారు. ఇంతవరకూ మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీలు వసూలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉన్నందుకు సిగ్గుపడాలని అన్నారు. అలాగే జిల్లాకు ఒక వైపు ఏనుగులు దాడిచేసి ఆస్తి, ప్రాణ నష్టాలు కలుగుచేస్తుంటే, ఇంకోకవైపు గిరిజన గ్రామాల్లో ప్రజలకు పులి కంటిమీద కునుకు లేకుండా చేస్తుందని, ఈ సమస్యలను అధికారులు సాగదీస్తున్నారే తప్ప, పరిష్కారానికి మార్గాలు అనుసరించడంలేదని అన్నారు. తక్షణమే రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, కురుపాం, పాలకొండ సాలూరు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

**పార్వతీపురం టౌన్ :** జిల్లాలో తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జనసేన నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కోరారు. సోమవారం ఆ పార్టీ నాయకులు వి.దాలి నాయుడు, శిరీస్, రాజాన రాంబాబు తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నూర్పిడి చేసి ధాన్యం అమ్మకాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ధాన్యాన్ని పొలాల్లో, కల్లాల్లో, రోడ్డు పక్కన ఉంచి వాటికి కాపు కాసేందుకు రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారని తెలిపారు. ఓవైపు మంచు, మరోవైపు ఏనుగులు, పులి భయంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను దళారుల నుంచి కాపాడాలని కోరారు.